

ఆదిలాబాద్ జిల్లా దస్నాపూర్ రేషన్ దుకాణంలో నో స్టాక్ బోర్డు

## నిలిచిన సన్న బియ్యం పంపిణీ

- రేషన్ దుకాణాల్లో నో స్టాక్ బోర్డులు
- నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలంటూ డీలర్ల విన్నపం

ఆదిలాబాద్, ఏప్రిల్ 10(నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం ఈ నెల ఒకటిన ఆర్భాటంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ ఆదిలాబాద్ జిల్లాలో ఆరురోజులకే తుస్సుమంది. ప్రభుత్వం గోదాం నుంచి బియ్యం సరఫరా చేయకపోవడంతో రేషన్ దుకాణాల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని 18 మండలాల్లో ప్రతి నెలా తెల్లరేషన్‌కార్డు లబ్ధిదారులకు 356 దుకాణాల ద్వారా 4,062.84 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తారు. ఎంఎల్ఎస్ పాయింట్లకు బియ్యం నిల్వలు చేరుకోకపోవడంతో రేషన్ డీలర్లు లబ్ధిదారులకు అందించడంలేదు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యం తెచ్చుకుందామని ఆశగా దుకాణాలకు వెళ్లిన లబ్ధిదారులకు నిరాశ ఎదురవుతున్నది. ప్రభుత్వం ప్రారంభించిన సన్న బియ్యానికి బదులు అధికారులు తమకు దొడ్డుబియ్యం పంపిణీ చేస్తున్నారంటూ రేషన్ డీలర్లు ఆందోళన చెందుతున్నారు. సన్నబియ్యం పంపిణీలో సమస్యలు పరిష్కరించాలంటూ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

## ఆర్టీసీలో నేటికీ అందని వేతనాలు

**మహాలక్ష్మితో ఆమ్దానీ అబద్ధమేనా..? • ఆలస్యంపై కార్మిక సంఘాల మండిపాటు**

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీలో 10వ తేదీ దాటినా వేతనాలు అందకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 'జీతాలివ్వండి సారూ' అంటూ వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. మహాలక్ష్మి పథకంతో లాభాలు వచ్చాయని యాజమాన్యం, ప్రభుత్వం ఊదరగొట్టినా ఇప్పటి వరకు వేతనాలు ఇవ్వలేని దుస్థితి నెలకొంది. అయితే ఆయాజోన్ల వారీగా వేతనాలు ఇస్తున్న ప్రభుత్వం.. అన్ని విభాగాల కార్మికులకు ఒకేసారి వేతనాలు ఇవ్వడంలేదని కార్మిక సంఘాల నేతలు మండిపడుతున్నారు. మెకానిక్ క్యాడర్ వరకు వేతనాలు ఇచ్చి, కిందిస్థాయి వారిని విస్మరించిందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు విడుదల కాకపోవటంతో జీతాలు చెల్లించటం ఆర్టీసీకి ఇబ్బందిగా మారింది. సంస్థలో నిధులులేక, అందరికీ ఒకేసారి జీతాలు చెల్లించే పరిస్థితి లేకపోవటంతో విడతల వారీగా వేతనాలు ఇస్తుండటం చర్చ నీయాంశంగా మారింది.

## భవన నిర్మాణ అనుమతులకు 'తెలంగాణ బిల్డ్ నౌ'

- మొదట జీహెచ్ఎంసీ.. తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమలు

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): భవన నిర్మాణ అనుమతులను త్వరితగతిన ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ బిల్డ్‌నౌ అనే ఏకీకృత భవన అనుమతి ఆన్‌లైన్ వేదికను ప్రారంభించిందని డైరెక్టరేట్ ఆఫ్ టౌన్, కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఈ ప్లాట్‌ఫామ్ అత్యాధునిక ఏఐ సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా భవన నిర్మాణ అనుమతులు రియల్ టైమ్‌లో వేగంగా ప్రాసెస్ చేస్తుందని.. తద్వారా పట్టణ అభివృద్ధిలో విప్లవాత్మక మార్పులు వస్తాయని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేదిక ద్వారా ఇప్పటివరకు జీహెచ్ఎంసీలో 308 భవన నిర్మాణ దరఖాస్తులు వచ్చాయని, ఇక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా అమలుచేస్తామని తెలిపారు. బిల్డ్ నౌ వ్యవస్థ అమలుపై వెయ్యిమంది సాంకేతిక నిపుణులకు ఈనెల4 నుంచి 19 వరకు శిక్షణ ఇస్తున్నట్టు వెల్లడించారు.

# ఐటీ అంటేనే చంద్రబాబు!

- తెల్లన్నం అంటేనే ఎన్టీఆర్
- సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు
- అధికారిక సభల్లోనూ అదే భజన
- 'యంగ్ ఇండియా' తన బ్రాండ్ అన్న సీఎం



యంగ్‌ఇండియా పోలీస్‌స్కూల్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): సందు దొరికితే చాలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన గురువు చంద్రబాబు భజన చేస్తున్నారని సొంత పార్టీ నేతలే ఆరోపిస్తున్నారు. ఇందుకు నిదర్శనంగా గురువారం జరిగిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభోత్సవంలో ఆయన మరోసారి తన భక్తిని చాటుకున్నారు. రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి ఆ తరువాత విద్యార్థులతో ఫుట్‌బాల్ ఆడి, సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన నెహ్రూ, ఇందిరాగాంధీతోపాటు ఎన్టీఆర్, చంద్రబాబు ప్రస్తావన తీసుకొచ్చారు. 'మొట్టమొదటిసారి రెండు రూపాయలకు కిలో బియ్యం ఇచ్చింది ఎన్టీరామారావు. పేదవాడు తెల్లన్నం తిన్నప్పుడల్లా ఆయనను గుర్తు చేసుకుంటాడు. ఐటీ కంపెనీలను, హైటెక్ సిటీని చూసినప్పుడు చంద్రబాబునాయుడు గుర్తొస్తారు' అంటూ వ్యాఖ్యానించారు. నిరుడు ఆగస్టులో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ వేసిన పునాదితోనే హైదరాబాద్‌లో ఐటీ రంగం వేళ్లూనుకున్నదని చెప్పారు. 'రాజీవ్‌గాంధీ దేశానికి కంప్యూటర్‌ను పరిచయం చేశారు. నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు హైటెక్ సిటీకి పునాదిరాయి వేశారు. హైదరాబాద్‌లో ఐటీరంగ నిపుణుల తయారీకి కాంగ్రెస్ కృషి చేసింది' అంటూ స్కిల్ యూనివర్సిటీపై చర్చ సందర్భంగా చెప్పారు. అప్పుడేమో ఐటీకి కాంగ్రెస్ పునాది వేసిందని చెప్పి ఇప్పుడు చంద్రబాబు నాయుడును ఐటీకి ఆద్యుడ్ని చేసేశారని కొందరు కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు.

### యంగ్ ఇండియా నా బ్రాండ్..

'ఈ మధ్య నేను ఎక్కడికి వెళ్లినా కూడా.. మీరు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 16 నెలలు అవుతున్నది. మీకంటూ ఎలాంటి బ్రాండ్ సృష్టించుకోలేదు అని పలువురు పాత్రికేయులు, మిత్రులు అంటున్నారు. చాలా సందర్భాల్లో నేను నవ్వి వదిలేసిన. ఎందుకంటే నేను ఏ బ్రాండ్ కోసం ప్రయత్నం చేస్తున్నానో ప్రశ్న అడిగేవారు అర్థం చేసుకునే పరిస్థితిలో లేరు. యంగ్ ఇండియా అనేది నా బ్రాండ్' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. మహాత్ముడి స్ఫూర్తితో యంగ్ ఇండియా బ్రాండ్‌ను తెలంగాణలో క్రియేట్ చేసుకున్నామని అన్నారు. వచ్చే ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, అకాడమీని ఏర్పాటు చేసుకోబోతున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించబోతున్నట్టు వెల్లడించారు. ఒకటో తరగతి నుంచి ఉన్న ప్రభుత్వ పాఠశాలల విధానంలో మార్పులు తీసుకొచ్చి ప్రీ-స్కూల్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సైనిక్ స్కూల్‌కు దీటుగా పోలీస్ స్కూల్‌ను తీర్చిదిద్దుతామని చెప్పారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఇక్కడ చదువుకునే విద్యార్థులను అకడమిక్స్‌తోపాటు అన్ని రంగాల్లో మెరుగ్గా రాణించేలా ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. డీజీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ఈ స్కూల్ ఏర్పాటుకు ప్రత్యేకంగా ఒక కమిటీని వేసుకొని, పని విభజన చేసి సకాలంలో అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ఫీజు ఎక్కువగా ఉన్న అంశంపై పలువురు అభ్యంతరం చెప్పారని, దీనిపై సుదీర్ఘంగా చర్చించి, తర్వలోనే తుది నిర్ణయం ప్రకటిస్తామని చెప్పారు. పోలీసులకు ప్రత్యేకంగా పోలీసు స్కూల్ తీసుకొచ్చినందుకు డీజీపీ జితేందర్ ముఖ్యమంత్రికి కృతజ్ఞలు తెలిపారు.

## రేకుల షెడ్డులో 'యంగ్ ఇండియా' స్కూల్





ప్రభుత్వం ఘనంగా చెప్తున్న యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను రేకులతో నిర్మించడం దుమారం రేపింది. అది మూసీపక్కన బఫర్ జోన్‌లో ఐదేండ్ల కింద కట్టిన తాత్కాలిక కట్టడమని తెలిసింది. ఈ రేకులషెడ్డును రెనోవేషన్ చేసి కొత్తదానిలాగా బిల్డప్ ఇచ్చారనే వాదన ఉన్నది. 2024 అక్టోబర్‌లో శంకుస్థాపన చేసిన ఈ స్కూల్‌ను ఆరు నెలల్లోనే ప్రారంభించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమైంది. కానీ, అది రేకుల షెడ్డు అని తెలిసి విద్యార్థుల తల్లిదండ్రులు పెదవి విరుస్తున్నారు. కేసీఆర్ హయాంలో గ్రేహౌండ్స్ బ్యారక్ కోసం 2020లో వేసిన షెడ్‌ను బాగుచేసి దానికే 'యంగ్ ఇండియా పోలీస్ స్కూల్' అని రేవంత్ నామకరణం చేశారు.

# సీఎం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి!

- రేవంత్ పేరు మరచిన మరో ఎమ్మెల్యే
- నెట్టింట వైరల్‌గా మారిన వీడియో



హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తేతెలంగాణ): ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి అధికార పగ్గాలు చేపట్టి దాదాపు 16 నెలలు అవుతున్నది. కానీ ఇప్పటికీ చాలామందికి ఆయన పేరు గుర్తుండటం లేదు. గత 16 నెలల్లో అనేకమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులు, చివరికి కాంగ్రెస్ పార్టీ నేతలు సైతం వేదికలపై రేవంత్ రెడ్డి పేరు మరిచిపోయారు. ఆయనకు బదులుగా వేరొకరిని ముఖ్యమంత్రిగా పేర్కొన్న ఘటనలు అనేకం. తాజాగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఒకరు ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పేరుకు బదులుగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేరు చెప్పారు. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ఎస్సీ వర్గీకరణపై గాంధీభవన్‌లో గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అని చాలా కాన్ఫిడెంట్‌గా పలికారు. మాదిగలకు న్యాయం చేసేది కాంగ్రెస్ ఒక్కటే అని..రాహుల్‌గాంధీ ఆదేశాలతో సీఎం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు ఎస్సీ రిజర్వేషన్లు చేశారని, వారికి ధన్యవాదాలు అని పేర్కొన్నారు. ఇటీవల సినీ నటుడు అల్లు అర్జున్, అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో, పలువురు సెలబ్రిటీలు, సొంత పార్టీ నేతలు సైతం సీఎంగా రేవంత్‌రెడ్డి పేరును మరిచిపోయారు. ఇక తాజాగా సీఎం పేరును తప్పుగా పలికిన ఎమ్మెల్యే మందుల సామేలు తన తప్పును సరిచేసుకోకపోవడం కొసమెరుపు.

### బిల్లులు ఇవ్వకపోతే పంచాయతీ భవనాన్ని వేలం వేస్తా..

- సావర్గాం మాజీ సర్పంచ్ జాదవ్ కల్యాణి-మహేందర్

నేరడిగొండ, ఏప్రిల్ 10: గ్రామ పంచాయతీ భవన నిర్మాణ బిల్లులు ఇవ్వకపోతే పంచాయతీ భవనాన్ని వేలం వేస్తానని సావర్గాం మాజీ సర్పంచ్ జాదవ్ కల్యాణి-మహేందర్ గురువారం ప్రకటించారు. పంచాయతీలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రావడం లేదని, ఫలితంగా అప్పుల్లో కూరుకు పోయామని తెలిపారు. చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక జీవితం భారంగా మారిందని పేర్కొన్నారు.

### ప్రపంచబ్యాంక్ అప్పు 4,150 కోట్లు

మొదటిపేజీ తరువాయి...

ఫలితాల ఆధారంగా ఈ నిధులను దశల వారీగా విడుదల చేయనున్నారు. ఇందుకోసం ప్రపంచబ్యాంకు బృందం రాష్ట్రంలో నాలుగు రోజులు పర్యటించి.. వైద్య ఆరోగ్యశాఖతో కలిసి పని చేయనుంది. ప్రపంచబ్యాంకు సాయం కోసం గత సెప్టెంబర్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. సర్కారు దవాఖానాల్లో మౌలిక వసతుల కోసం రూ.4,944 కోట్ల ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం పంపింది. కాగా ప్రపంచ బ్యాంకు రూ.4,150 కోట్లకు పచ్చ జెండా ఊపింది. ఈ నిధులను ప్రధానంగా స్పెషాలిటీ దవాఖానల్లో పరికరాల కొనుగోలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ట్రామా కేర్‌ల ఏర్పాటుకు వినియోగించనున్నారు. వీటితోపాటు మహిళలు, వయోవృద్ధుల ఆరోగ్యం, అసాంక్రమిక వ్యాధులకు నిధులు వెచ్చించనున్నారు. జాతీయ రహదారుల వెంట ప్రతి 30 కిలోమీటరుకు ఒక ట్రామాకేర్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు.

# పెద్ద నేత..చిన్న పనులు

- చర్చనీయాంశంగా మారిన కాంగ్రెస్‌లోని కీలక నేత తీరు
- అధిష్ఠానానికి కొందరు ఫిర్యాదు
- అసహనంతో ఉన్న మీనాక్షి!

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర కాంగ్రెస్‌లో ఇప్పుడు అందరూ ఆ నాయకుడి గురించే మాట్లాడుకుంటున్నారు. అనుకోని అవకాశంతో పెద్ద పదవిలోకి వచ్చిన ఆ నేత తీరు ఇప్పుడు వివాదాస్పదమవుతున్నది. ఆ నేత తీరుపై గుర్రుగా ఉన్న సీనియర్లు కొందరు ఇప్పటికే హైకమాండ్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. పార్టీ కోసం కాకుండా కేవలం తన కోసమే పార్టీని వాడుకుంటున్నాడని ఆ నేతపై ఫిర్యాదు చేశారు. పార్టీలో పెద్దపదవిలో ఉన్న ఆయనకు పెద్ద బంగళా ఇప్పించే బాధ్యతను ఓ మంత్రి తీసుకున్నారు. ఏకంగా మంత్రుల నివాస ప్రాంగణంలోనే ఓ బంగళాను ఇవ్వాలని నిర్ణయించారు. అనుకున్నదే తడవుగా ఆ బంగ్లాను మంత్రి పేరుపై అలాట్‌మెంట్ చేయించారు. ఇప్పుడు ఆ బంగ్లాకు మరమ్మతులు చేస్తున్నారు. ఇందుకోసం సుమారు రూ.కోటి ఖర్చు చేస్తున్నట్టు అంచనా. కానీ, పనులకు ఆమోదం, బిల్లు మంజూరుపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు, మంత్రి కినుకు వహించారు. దీంతో సదరు పార్టీ పెద్ద నేత పదిసార్లు సంబంధిత ఆర్థిక శాఖ అధికారులకు, మంత్రికి తన గోడు విన్నవించుకుంటున్నట్టు పార్టీలో చర్చ జరుగుతున్నది. పార్టీ పదవిలో ఉన్న నేతకు ఉన్న రాజ్యాంగబద్ధమైన పదవి రీత్యా ఎమ్మెల్యే/ఎమ్మెల్సీల నివాస గృహ సముదాయంలో అపార్ట్‌మెంటు మాత్రమే కేటాయించేందుకు అవకాశం ఉన్నది. అయితే, ఈ నేత అక్కడ అపార్ట్‌మెంట్ తీసుకోవడంతోపాటు ఇక్కడ మంత్రుల నివాస ప్రాంగణంలోని బంగ్లా కూడా వాడుకునేందుకు పెద్ద స్కెచ్ వేసినట్టు పార్టీలో చర్చ జరుగుతున్నది. అపార్ట్‌మెంట్‌ను క్యాంప్ కార్యాలయంగా మార్చేసుకున్నాడని పలువురు అంటున్నారు.

### కరాటే పోటీలు.. కోటిన్నరకు స్కెచ్

సదరు పెద్ద నేత ప్రభుత్వం మనదే కదా అని కరాటే పోటీలకు కోటిన్నర ఇవ్వాలంటూ ప్రతిపాదన పెట్టారు. ఏకంగా ముఖ్యమంత్రికే ఆయన లేఖ రాశారు. ముఖ్యమంత్రి కూడా సానుకూలంగా స్పందించారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. కరాటే పోటీలకు కూడా ఇంత పెద్దఎత్తున ప్రభుత్వం సొమ్మును విడుదల చేయాలని కోరడం పెద్ద నేతకే చెల్లిందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. కాంగ్రెస్ పార్టీలో ఆ పెద్ద నేతకు పదవి వచ్చినప్పటి నుంచి జిల్లాలు తిరగడం తక్కువ.. ఢిల్లీకి, విదేశాలకు తిరగడమే ఎక్కువ అని కార్యకర్తలు వాపోతున్నారు. జిల్లాల్లో కమిటీలు లేవు.. రాష్ట్ర స్థాయిలో పార్టీ పటిష్ఠానికి చేసిందేమీ లేదు కానీ.. పర్యటనలతోనే కాలం గడుపుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఇదే విషయమై పార్టీలోని ఓ వర్గం నేతలు ఢిల్లీలోని హైకమాండ్‌కు ఫిర్యాదులు కూడా చేశారు. పార్టీలోని ఓ కీలక నేత ఇప్పటికే రెండుసార్లు పార్టీ అధిష్ఠానానికి లేఖ రాసినట్టు చెప్పుకుంటున్నారు. ఇటీవల పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కూడా పార్టీ పెద్ద నేత తీరుపై అసహనం వ్యక్తం చేశారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం రామచంద్రాపురంలో సీఐ గన్‌మన్‌పై పిడిగుద్దులతో దాడి చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## పోలీసులపై కాంగ్రెస్ నాయకుల దాడి

అశ్వాపురం, ఏప్రిల్ 10 : ఓ భూ వివాద ఘటనలో రక్షణ కల్పించడం కోసం వెళ్లిన పోలీసులపై కాంగ్రెస్ నాయకులు పిడిగుద్దులతో దాడి చేసిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం రామచంద్రాపురంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన టీపీసీసీ నాయకుడు కనకమేడల హరిప్రసాద్ తన అనుచరులతో కలిసి రామచంద్రాపురంలోని తమ పూర్వీకుల పట్టా భూమి సర్వే నెంబర్ 190/129లో ఫెన్సింగ్ వేస్తున్నాడు. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న గ్రామస్థులు అది ప్రభుత్వ స్థలమని, అందులో ఫెన్సింగ్ వేయొద్దని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. రక్షణ కోసం అక్కడికి వెళ్లిన సీఐ అశోక్‌రెడ్డి ఇరువర్గాలను వారిస్తుండగా.. సివిల్ డ్రెస్‌లో ఉన్న గన్‌మన్ రమేశ్ కాలర్ పట్టుకొని కొందరు కాంగ్రెస్ నాయకులు పిడిగుద్దులతో దాడిచేశారు. వెంటనే తేరుకున్న సీఐ ఇరువర్గాలను చెదరగొట్టి, గన్‌మన్‌పై చేయిచేసుకున్న వారిపై కేసు పెట్టనున్నట్టు తెలిపారు.

## బీజేపీకి రేవంత్ సహకారం

- ఆయన సీఎం అయ్యాకే మాకు బలం పెరిగింది
- నిజామాబాద్ ఎంపీ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బీజేపీకి సీఎం రేవంత్‌రెడ్డి సహకారం ఉందని నిజామాబాద్ బీజేపీ ఎంపీ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో గురువారం ఆయన ఓ టీవీ చానల్ ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాకే బీజేపీ రాష్ట్రంలో బలపడిందని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం అనేది తమ పార్టీ నేతల చేతుల్లోనే ఉందని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి హైదరాబాద్‌ను బేస్‌మెంట్‌తో సహా కూల్చివేయడం ఖాయమని ఘాటుగా విమర్శించారు. ఎన్నికల ముందు ప్రజలు రేవంత్ రెడ్డిని తురుంఖాన్ అనుకున్నారని.. కానీ అయన జోకర్, పేపర్ పులి అని తేలిపోయిందని విమర్శించారు. ప్రజలు రేవంత్‌రెడ్డిని ద్వేషిస్తున్నారని, గ్రామాలకు వెళ్తే కొట్టే పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. సబ్జెక్ట్ లేకపోవడంతోనే రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు.



### • గ్యాస్ ధరలను తగ్గించాలి

కేంద్ర ప్రభుత్వం ఇటీవల వంట గ్యాస్ సిలిండర్ ధరలను పెంచడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహిళలు రోడ్డెక్కారు. తుంగతుర్తి మండలం గొట్టిపర్తిలో ఖాళీ సిలిండర్లతో గురువారం నిరసన తెలిపారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య, రాములుగౌడ్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బర్ల సోమన్న, నాయకులు తెడ్డు హరిబాబు, గోపగాని రమేశ్, దూదిగాని లింగయ్య, నాలి మురళి, తాళ్లపల్లి యాకయ్య, సమ్మడ పాషా, చిట్టి సాలయ్య, నగేశ్, మహిళలు పాల్గొన్నారు. - అర్వపల్లి

# వర్సిటీల బంద్ విజయవంతం

- కాంట్రాక్టు అధ్యాపకుల నిరసనలతో హోరెత్తిన విశ్వవిద్యాలయాలు
- మిన్నంటిన సర్కారు వ్యతిరేక నినాదాలు
- రెగ్యులరైజ్ చేసేదాకా పోరు ఆగదు : జేఏసీ



అక్రమ అరెస్టులను ఖండిస్తూ ఖమ్మంలోని పీజీ, వ్యాయామ కళాశాలలో తరగతులు బహిష్కరించి ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్, పార్ట్‌టైం అధ్యాపకులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 10: కాంట్రాక్టు అధ్యాపకుల అక్రమ అరెస్టులకు నిరసనగా కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ పిలుపుమేరకు గురువారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన యూనివర్సిటీల బంద్ విజయవంతమైంది. ఉస్మానియా, కాకతీయ, శాతవాహన, మహాత్మాగాంధీ, అంబేద్కర్ విశ్వవిద్యాలయాలు నిరసనలతో హోరెత్తాయి. ఉదయం నుంచి జేఏసీ నాయకులు ర్యాలీలు తీశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళనకు దిగారు. 'అక్రమ అరెస్టులు సిగ్గు సిగ్గు.. వుయ్ వాంట్ జస్టిస్.. ఇదేమి రాజ్యం.. ఇదేమి రాజ్యం' అని నినదించారు. జీవో-21ను రద్దు చేయాలని బాసర ట్రిపుల్ ఐటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆర్జీయూకేటీ ప్రధాన ద్వారం వద్ద బైఠాయించారు. కూకట్‌పల్లి జేఎన్టీయూహెచ్ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు విధులు బహిష్కరించారు. అనంతరం వర్సిటీ వైస్ చాన్స్‌లర్ టీ కిషన్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ జీవీ నరసింహారెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. ఖమ్మం వర్సిటీ పీజీ, వ్యాయామ కళాశాలల ఎదుట ధర్నా నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జేఎన్టీయూల్లో తరగతులు బహిష్కరించి పోలీసుల తీరును ఖండించారు. పాలమూరు వర్సిటీలో అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ఎదుట బైఠాయించారు. తెలంగాణ వర్సిటీ సౌత్ క్యాంపస్‌లో బంద్ పాటించారు. అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వర్సిటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ నాయకులు బైరి నిరంజన్, పరశురాం, జితేందర్‌రెడ్డి, శ్రీధర్‌లోథ్, రాజేశ్, ధర్మతేజ మాట్లాడుతూ.. శాంతియుతంగా నిరసన తెలిపిన మహిళా అధ్యాపకులపై పోలీసుల దాష్టీకానికి నిరసనగా చేపట్టిన బంద్ జయప్రదమైనట్టు తెలిపారు. ఇందుకు సహకరించిన విద్యార్థి, ఉద్యోగ, పరిశోధక సంఘాల బాధ్యులు, తమ ఆవేదనను సమాజానికి చూపిన మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు. పదేండ్ల సర్వీసు పూర్తిచేసిన వారిని రెగ్యులరైజ్ చేయాలని గతంలో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిందని గుర్తుచేశారు. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న 1,270 మంది ఒప్పంద అధ్యాపకులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పెడచెవిన పెడుతున్నదని ధ్వజమెత్తారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆందోళనకు దిగిన కాంట్రాక్టు అధ్యాపకులపై పోలీసులతో దాడి చేయించడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించే దాకా పోరాటం ఆగదని తేల్చిచెప్పారు.

### టీ ఫైబర్‌తో ప్రతి ఇంటికీ ఇంటర్నెట్: శ్రీధర్‌బాబు



హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రతి ఇల్లు, కార్యాలయానికి తెలంగాణా ఫైబర్‌నెట్ ద్వారా ఇంటర్నెట్ సేవలు కల్పించనున్నట్టు ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి డీ శ్రీధర్‌బాబు వెల్లడించారు. బేగంపేటలో గురువారం టీ ఫైబర్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించడంతోపాటు టీఫైబర్ కొత్త లోగోను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేబుల్ ఆపరేటర్ల సహకారంతో రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు టీవీ చానళ్ల సదుపాయం కల్పిస్తామని తెలిపారు. టీవీ సెట్లను కంప్యూటర్ మానిటర్‌గా వినియోగించుకుని విద్యార్థులు ప్రయోజనం పొందేలా టెక్నాలజీ రూపొందించినట్టు చెప్పారు. 'టీ ఫైబర్ ఇప్పటికే 424 మండలాల్లోని 8,891 గ్రామ పంచాయతీలను అనుసంధానం చేసిందని పేర్కొన్నారు. మరో 7,187 పంచాయతీలు సేవలు అందుకోవటానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా వ్యాపార భాగస్వాములతో అవగాహన ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ డిప్యూటీ సెక్రెటరీ భవేశ్‌మిశ్రా, టీ ఫైబర్ ఎండీ వేణుప్రసాద్ పన్నేరు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీలు ఆదర్శంగా నిలవాలి: సీతక్క



హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన సేవలందించడంతోపాటు పరిశుభ్రత, పౌష్టికాహారంలో తెలంగాణ అంగన్‌వాడీలు దేశానికే ఆదర్శంగా నిలవాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆకాంక్షించారు. గురువారం ఆమె సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేంద్రం రాష్ట్రాలకు గ్రేడింగ్‌లు ఇచ్చిన విధంగా రాష్ట్రం జిల్లాలకు గ్రేడింగ్‌లు ఇచ్చే విధానాన్ని తీసుకొస్తామని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే సరుకుల్లో నాణ్యత లోపిస్తే, అందుకు బాధ్యులైన వారిని బ్లాక్‌లిస్టులో పెడతామని హెచ్చరించారు. అంగన్‌వాడీ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని సూచించారు. కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితారామచంద్రన్, డైరెక్టర్ కాంతివెస్లీ పాల్గొన్నారు.

### బీజేపీ హయాంలోనే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై దాడులు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాకే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై దాడులు పెరిగాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆరోపించారు. హైదరాబాద్‌లోని సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయాన్ని బీజేపీ పూర్తిగా వ్యతిరేకిస్తున్నదని మండిపడ్డారు. మనువాదం, కార్పొరేట్ సంస్థల దోపిడీని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 14 వరకు సభలు, ప్రదర్శనలకు పిలుపునిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో కులాంతర వివాహం చేసుకున్నందుకు 100 మంది, కులవివక్షను ప్రతిఘటించినందుకు 1000 మందికి పైగా ఏడాదిలో హత్యకు గురయ్యారని ఆరోపించారు. సామాజిక న్యాయం కోసం నిర్వహించే కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### ఎన్నారై అడ్వయిజరీ కమిటీ నియామకం

- చైర్మన్‌గా వినోద్‌కుమార్, వైస్ చైర్మన్‌గా మంద భీంరెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): గల్ఫ్ కార్మికుల సంక్షేమం, సమగ్ర ఎన్నారై పాలసీపై అధ్యయనానికి 15 మంది సభ్యులతో అడ్వయిజరీ కమిటీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం జీవో విడుదల చేశారు. రెండేళ్ల కాలపరిమితి గల ఈ కమిటీ చైర్మన్‌గా ఇండియన్ ఫారిన్ సర్వీస్ రిటైర్డ్ అధికారి, అంబాసిడర్ డాక్టర్ బీ ఎం వినోద్‌కుమార్, వైస్ చైర్మన్‌గా గల్ఫ్ వలసల నిపుణులు మంద భీంరెడ్డిని నియమించారు. జీఏడీ ప్రొటోకాల్, ఎన్నారై విభాగానికి చెందిన జాయింట్ సెక్రటరీ స్థాయి ఐఏఎస్ అధికారి కమిటీకి మెంబర్ సెక్రటరీగా వ్యవహరిస్తారు. ఈ కమిటీలో గౌరవ సభ్యులుగా టీ జీవన్‌రెడ్డి, ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం, భూపతిరెడ్డి, ఈరవత్రి అనిల్‌ను, సభ్యులుగా కొందరు ప్రవాసీలను నియమించారు.